# ఉపోద్ఘాతము

లేవీయకాండము అనునది మోషే వ్రాసిన పుస్తకములలో మూడవది మరియు మధ్యలోనిది. ఈ పుస్తకమునకు ప్రధాన అంశమైన పరిశుద్ధత అనేది ఈ పంచగ్రంథములలో చెప్పబడిన కథనము అంతటిలో సర్వోచ్ఛమైనది.

దేవుని సృష్టిలో ఉన్నతమైన స్థానము కలిగిన మానవుడు పాపము చేసి దేవుని నుండి ఏ విధంగా దూరముగా పైదొలగిపోయాడో ఆదికాండము బయలుపరుస్తుంది. అబ్రాహాము యొక్క కుటుంబము ద్వారా దేవుడు మానవుని తనయొద్దకు తిరిగి తీసుకొనివచ్చుటకు తన ప్రణాళికను ఎలా రూపొందించాడో కూడా ఇది తెలుపుతుంది. ఈ అబ్రాహాము యొక్క కుటుంబము ఒక జనాంగముగా ఎలాగైనదో నిర్గమకాండము నివేదిస్తుంది. ఆ జనాంగమును తన సొంత జనముగా చేసికొని వారిని బంధకము నుండి విడిపించిన విధానమును కూడా ఈ పుస్తకము వివరిస్తుంది. ఆయన వారిని సీనాయి పర్వతమునకు నడిపించి వారు పరిశుద్ధులుగా ఉండాలని వారికి చెప్పి వారితో ఒక నిబంధనను చేసాడు. వారికి ధర్మశాస్త్రమును అనుగ్రహించి తాము దేవుని ఆరాధించుటకు అనుకూలముగా ఒక ప్రత్యక్ష గుడారమును నిర్మించునట్లు వారిని నడిపించాడు. ఇట్టి ఈ దేశము ఎన్ని పాపములు చేసినప్పటికీ కూడా దేవునిచే ఎలా కాపాడబడింది, మరియు అరణ్యములో నలుబది సంవత్సరములు గడిపిన తరువాత వాగ్దాన దేశము యొక్క సరిహద్దుల వరకు ఎలా నడిపించబడినదో అనే విషయమును సంఖ్యాకాండము నివేదిస్తుంది. దేవునిచే ఇవ్వబడిన ఆ ధర్మశాస్త్రమును పాటిస్తూ పరిశుద్ధులుగా ఉండునట్లు వాగ్దాన దేశమునకు ప్రవేశించిన తరుణములో ఈ జనమునకు ఇవ్వబడిన అవసరమగు హెచ్చరికలను ద్వితీయోపదేశకాండములో చదువుతాము.

ఈ కథనమునకు మధ్యలో, దేవుడు ఉద్దేశించిన ఇశ్రాయేలు దేశమును చిత్రీకరిస్తున్నదిగా లేవీయకాండమును చూడవచ్చు. తన ప్రజలతో దేవుడు నిబంధనను స్థిరపరచినప్పుడు, వారు ఆయనకు "యాజక రూపమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను ఉందురని" ఆయన చెప్పాడు (నిర్గమ. 19:6). "పరిశుద్ధమైన జనము" అనే మాటకు అర్థము ఏమిటి? నిర్గమకాండము నుండి ద్వితీయోపదేశకాండములో ఉన్న న్యాయవిధులన్నియు ఈ ప్రశ్నకు జవాబు చెప్పుటకు దోహదపడతాయి, కాని ఇశ్రాయేలు పరిశుద్ధమైనదిగా ఉండాలని దేవుడు పలికినప్పుడు ఆయన ఏమి ఉద్దేశించాడో అనేదానిపై స్పష్టతను ఇవ్వడానికి లేవీయకాండములో ఉన్న కట్టడలు ప్రత్యేకముగా రూపించబడ్డాయి. లేవీయకాండము 11:45లో ఈ గుర్తుండిపోయే మాటలు ఉన్నాయి: "నేను మీకు దేవుడనైయుండుటకు ఐగుప్తు దేశములో నుండి మిమ్మును రప్పించిన యెహోవాను; నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులు కావలెను."

పంచగ్రంథములలోని విషయములను ఈ క్రింది విధముగా సారంశపరచవచ్చును:

*ఆదికాండము*

రక్షణ కొరకైన ఆవశ్యకత ఏర్పడినది.

అబ్రాహాము యొక్క కుటుంబము ద్వారా రక్షణ కార్యమునకు నాంది పలుకబడింది.

*నిర్గమకాండము*

అబ్రాహాము యొక్క కుటుంబము ఒక దేశముగా అయినది.

ఇశ్రాయేలు దేశముతో దేవుడు ఒక నిబంధనను చేశాడు.

*లేవీయకాండము*

ఇశ్రాయేలు దేశము ఒక పరిశుద్ధమైన దేశముగా ఉండాలని దేవుడు కోరాడు.

*సంఖ్యాకాండము*

దేవుడు అనుకున్నట్టుగా జీవించుటలో ఇశ్రాయేలు విఫలమైంది.

తన కృపచేత దేవుడు ఇశ్రాయేలు దేశమును వాగ్దాన దేశమునకు నడిపించాడు.

*ద్వితీయోపదేశకాండము*

పరిశుద్ధమైన జనముగా ఉండుటకుగాను భవిష్యత్తు కాలములో దేవుని విధులన్నిటిని గైకొనవలెనని ఇశ్రాయేలు హెచ్చరిక చేయబడింది.

## నామము

పంచగ్రంథములలో లేవీయకాండము మూడవ పుస్తకము. ఆంగ్ల పాతనిబంధనలో, ఈ ఐదు పుస్తకములు ధర్మశాస్త్ర గ్రంథములుగా విభాగించబడ్డాయి; హెబ్రీ బైబిల్ లో అయితే ఇవి *తోరాగా* (Torah) ప్రసిద్ధమైనది, ఈ మాటకు అర్థము "ధర్మశాస్త్రము" లేదా "ఉపదేశము."[1]

హెబ్రీ భాషలో, ఈ పుస్తకమునకు మొట్టమొదటి పదమైన וַיִּקְרָא *(వయ్యిక్ర)*, అంటే "మరియు ఆయన పిలిచెను"[2] అనే అర్థాన్నిచ్చే, పదమును లేవీయకాండమునకు పేరుగా పెట్టారు. "లెవిటికస్" అనే ఆంగ్లపదము సెప్టువజింట్, లేదా LXX (అంటే క్రీ.పూ. 250లో అనువదించబడిన హెబ్రీ బైబిల్ యొక్క ప్రాచీన గ్రీకు అనువాదము) నుండి అనువదించబడింది. దీని అర్థము "లేవీయులకు సంబంధించినది."[3]

లేవీయులు అనువారు యాజక గోత్రీయులు. బంగారు దూడకు ఇశ్రాయేలీయులు ఆరాధన చేసిన తరువాత ఈ విధమైన పనికొరకు వీరు నియమింపబడ్డారు. లేవీయులు మోషే పక్షముగా వాదించి ఆ బంగారు ప్రతిమకు ఆరాధించిన వారినందరినీ శిక్షించారు గనుక వారు యెహోవా కొరకు ప్రత్యేకపరచబడి ఆయనచే ఆశీర్వదింపబడ్డారు (నిర్గమ. 32:26-29). వారి ప్రధానమైన పని ప్రత్యక్షగుడారమును (తరువాత కాలములో దేవాలయమును) గూర్చి శ్రద్ధ తీసుకోవడం మరియు దాని కార్యకలాపములలో సహరించడం.[4] దేవుని గుడారము మరియు దేవుని ప్రజల విషయమైన పూచీ లేవీయులకు పూర్తిగా ఇవ్వబడినది గనుక, మిగిలిన అన్ని గోత్రములచే వీరు జాగ్రత్తగా

పోషించబడాలని దేవుడు ఆజ్ఞాపించాడు. దశమ భాగములు మరియు అర్పణాయుతమైన కానుకల ద్వారా ప్రజలు వీరిని పోషించవలసినవారిగా ఉన్నారు. ఇశ్రాయేలు యొక్క పండ్రెండ్రు గోత్రములలో ఈ లేవీయ గోత్రము ఒకటిగా లెక్కింపబడలేదు.[5] ఇశ్రాయేలు వారు కనాను దేశమును స్వతంత్రించుకొనిన తరువాత, మిగిలిన గోత్రములవలె వీరు కూడా ఒక ప్రాంతమును స్వీకరించుటకు బదులుగా, ఇశ్రాయేలు దేశమంతటిలో విస్తరించియున్న నలుబది-ఎనిమిది వివిధమైన పట్టణములు లేవీయులకు ఇవ్వబడియున్నవి.[6]

లేవీయకాండము అనునది అనేకమైన చట్టములతో నిండుకొనియున్న ఒక గ్రంథము. దేవుడు పరిశుద్ధుడుగా ఉన్నలాగున తన ప్రజలు కూడా పరిశుద్ధులుగా ఉండునట్లు వారి నుండి దేవుడు కోరుతున్నదేమిటో అనే విషయాన్ని అటు అరణ్యయాత్రలోను మరియు తన చరిత్ర ఆద్యంతములోను ఇశ్రాయేలు దేశమునకు బయలుపరచడం ఈ లేవీయకాండము యొక్క ఉద్దేశమై యున్నది.

## రచయిత

లేవీయకాండము అను గ్రంథము తన రచయితను గుర్తించడం లేదు కాని దానియందు ఇమిడియున్న న్యాయవిధులు ఇశ్రాయేలీయులకు ఇచ్చులాగున దేవునిచే మోషేకు ఇవ్వబడినవి అని మాత్రము ఈ పుస్తకము చెప్తుంది. ఉదాహరణకు, ఈ పుస్తకము “యెహోవా మోషేను పిలిచి ప్రత్యక్షపు గుడారములోనుండి అతనికీలాగు సెలవిచ్చెను - నీవు ఇశ్రాయేలీయులతో ఇట్లనుము - . . .” (1:1, 2; చూడండి 4:1; 5:14; 6:1, 8, 19, 24; 7:22, 28, 38)[7] అను మాటలతో ప్రారంభమౌతుంది. ఈ పుస్తకమునకు ముందున్న నిర్గమకాండముతోను మరియు తరువాత పుస్తకమైన సంఖ్యాకాండముతో ఈ పుస్తకమునకున్న సంబంధమును బట్టి చూస్తే ఇది పంచగ్రంథములలో ఒక సమగ్రమైన భాగముగా కనిపిస్తుంది.

సాంప్రదాయకంగా, పంచగ్రంథములన్నిటిని కూడా వ్రాసిన వానిగా మోషేను గూర్చి చెప్తారు. పంచగ్రంథములలోని ఏ ఒక్క పుస్తకముకూడా మోషే వీటిని వ్రాసినట్లు ఆధారాలు ఇవ్వకుండగా, అనేకమైన సంఘటనలను మరియు న్యాయవిధులను మోషే నమోదు చేసినట్లుగా అనేక వాక్యభాగములు చెప్తున్నాయి (నిర్గమ. 17:14; 24:4; 34:27; సంఖ్యా. 33:1, 2; ద్వితీ. 31:9, 19, 22). ఇతర పాతనిబంధన వాక్యములు ధర్మశాస్త్రగ్రంథములను మోషేకు ఆపాదిస్తున్నాయి (యెహోషువా 1:7, 8; 8:31, 32; 1 రాజులు 2:3; 2 రాజులు 14:6; 21:8; ఎజ్రా 6:18; నెహెమ్యా 13:1; దానియేలు 9:11-13; మలాకీ 4:4). మోషేయే ధర్మశాస్త్రమునకు రచయిత అనే ఆలోచనను యేసు, అపొస్తలులు, మరియు క్రొత్తనిబంధన కాలములోని సువార్తీకులు అంగీకరించారు (మత్తయి 19:8; మార్కు 12:26; యోహాను 1:45; 5:46, 47; అపొ. 3:22; 28:23; రోమా. 10:5). పరిశుద్ధగ్రంథమునకు తరువాత కాలములో పంచగ్రంథమును వ్రాసినది మోషేయే అనే విషయాన్ని యూదులు నమ్మినట్టుగా యూదుల రచనల ద్వారా తెలుస్తుంది.[8]

ఉదారవాద పండితులచే[9] ప్రతిపాదించబడిన ఆలోచన ఏమనగా, ధర్మశాస్త్రము

మోషేచే వ్రాయబడడం కంటే కూడా, మౌఖిక సంప్రదాయమునకు చెందినా వివిధమైన వ్రాత మూలముల నుండి కొన్ని శతాబ్దాలుగా అనేకమంది సంపాదకీయులచే (లేదా ఎడిటర్ లచే) సంకలనము చేయబడినది అని చెప్పడం. ఈ ఆలోచనకు ఉత్తమమైన ప్రాతినిధ్యం వహించిన లిఖితపూర్వకమైన పరికల్పన (డాక్యుమెంటరీ హైపోథీసిస్)[10]ను Julius Wellhausen అనే రచయిత పంతొమ్మిదవ శతాబ్దపు రెండవ భాగములో ప్రతిపాదించాడు. పంచగ్రంథముల యొక్క కడపటి రూపము నాలుగు వివిధమైన దస్తావేజుల నుండి సంకలనము చేయబడినవి అని ఆయన అన్నాడు: "J" ("Yahwist" నుండి), "E" ("Elohist" నుండి), "D" ("Deuteronomist" నుండి), మరియు "P" ("Priestly" నుండి).[11] ఈ ఆలోచన ప్రకారముగా, ధర్మశాస్త్రమును రూపించిన ఘనతను యూదులు మోషేకు ఆపాదించారు, కాని యూదుల విధానములోని వాస్తవమైన ధార్మిక మరియు నైతిక విలువలు ప్రవక్తలతో వచ్చినవి. లేవీయకాండము గ్రంథము "P" (అంటే Priestly అనబడే దస్తావేజు) నుండి వచ్చినట్టుగా చెప్తారు, మరియు ఈ దస్తావేజు చెరకాలములో లేదా చెరతరువాత కాలములో అంటే క్రీ.పూ. ఆరవ లేదా ఐదవ శతాబ్దములో సుమారు క్రీ.పూ. 450లో వ్రాయబడి ఉంటుంది. "P" అను దస్తావేజులో "పరిశుద్ధత నియమము" (లేవీయకాండము 17-26 అధ్యాయములు), అంటే వేరుయైన మూలముగల మరొక భాగము కూడా ఉంది.[12]

ఈ లిఖితపూర్వకమైన పరికల్పనకు మద్దతునిచ్చే ఒక వాదము ఏమనగా "యాజకత్వపు నియమము యొక్క శాసనము ఇశ్రాయేలు ధర్మము ఎదుగుదలలోని తదుపరి, చెర తరువాత కాలమును సూచిస్తుంది; ఈ విధమైన చట్టములు క్రీ.పూ. ఐదవ శతాబ్దము వరకు కూడా చేయబడి ఉండవు" అనే ఆలోచన.[13] ఈ వాదనను త్రోసిపుచ్చుతూ Gleason L. Archer, Jr., అనే రచయిత "యాజకత్వపు నియమము"కిని (అలాగే పంచగ్రంథములలోని ఇతర భాగములకును) మరియు ప్రాచీన పశ్చిమ ఆసియాలోని ఇతర చట్టములతో, అంటే ఏ విధంగా చూసినా మోషే కాలమునకు పూర్వమే ఉండిన, ఆ చట్టములతో పోల్చి చూపాడు.[14]

ఈ లిఖితపూర్వకమైన పరికల్పనను చాల మంది స్వీకరించినప్పటికీ కూడా, పరిశుద్ధగ్రంథపు విద్యార్థులు ఇది సరియైనదే అని మాత్రము తలంచకూడదు. ఈ ఆలోచనను అంగీకరించుటలో అనేకమైన సమస్యలు ఉన్నాయి.

మొదటిగా, ఈ విధమైన పరికల్పనను నిరూపించుటకుగల ఆధారములు చాలా తక్కువ. క్షుణ్ణమైన పరిశీలన చేసిన తరువాత, కొంతమంది ఉదారవాద పండితులచే చేయబడిన ఊహాగానములను మునుపు అంగీకరించిన వారికి మాత్రమే ఈ ఆధారము ఆమోదయోగ్యమైనదిగా ఉన్నది - ఈ ఊహాగానములలో ఒకటి అసహజమైన ఒక కార్యము చరిత్రలో జరిగి ఉండనే ఉండదు అనే వాదన.

రెండవదిగా, ఈ లిఖితపూర్వకమైన పరికల్పన అనునది ఇశ్రాయేలు ధర్మము పురోగతిని గూర్చి చేసిన పరిణామ వీక్షణ, ఇది తప్పు అని కూడా నిరూపించబడినది.

మూడవదిగా, పంచగ్రంథములలోని పుస్తకములు లిఖితపూర్వకమైన పరికల్పనలో ఉన్న దస్తావేజులు లిఖించబడిన కాలమునకు మునుపటివే. పంచగ్రంథములు మోషే చేతనే వ్రాయబడినవి అని చెప్పడానికి ఈ కాలక్రమము మరింత అధిక కారణములను ఇస్తున్నాయి.

పరిశుద్ధగ్రంథపు ఆధారములను, మోషేనే వ్రాసాడు అనడానికి ఉన్న ఆధారములను,[15] మరియు లిఖితపూర్వకమైన పరికల్పన యొక్క బలహీనతలను పరిగణనలోనికి తీసికొంటే, పాతనిబంధనలోని అయిదు పుస్తకములను, లేవీయకాండముతో కలిపి, మోషేనే వ్రాసాడు అనడానికి దీనికంటే మరింత మంచి కారణము ఉండదు. లేఖనముల యొక్క ప్రేరణను విశ్వసించే ప్రతియొక్క క్రైస్తవుడు కూడా ఇశ్రాయేలునకు దేవుడు మోషే ద్వారా ధర్మశాస్త్రమును ఇచ్చాడు అనే పరిశుద్ధ గ్రంథ సత్యమును స్వీకరించవలసి వచ్చింది.

## తారీఖు

ఈ పుస్తకము యొక్క తారీఖు దీని యొక్క రచయితపై ఆధారపడి ఉంటుంది. లిఖితపూర్వకమైన పరికల్పనను అనుసరించే వారి ప్రకారము, లేవీయకాండము సుమారు క్రీ.పూ. 500-400 సంవత్సర కాలముల మధ్య వ్రాయబడినది. ఒకవేళ మోషేయే దీనికి రచయితయైనట్లయితే, ఈ పుస్తకము తన జీవిత కాలములోనే వ్రాయబడి ఉంటుంది అని చెప్పవచ్చు. కాగా, ఈ లేవీయకాండము పుస్తకమును నిర్గమము జరిగిన కాలమునకు సమీపములో చెప్పవచ్చు; మరియు సంప్రదాయవాద పండితులు నిర్గమము యొక్క కాలమును క్రీ.పూ. 1445గా చెప్తారు.[16]

## చారిత్రక నేపథ్యము

సీనాయి పర్వతము దగ్గర ఇశ్రాయేలీయులు గడిపిన ఒక సంవత్సర కాలములో మోషే ద్వారా దేవుడు ఇచ్చిన న్యాయవిదులనే లేవీయకాండము ప్రధానముగా కలిగి ఉంది.[17] ప్రత్యక్ష గుడారము యొక్క నిర్మాణము మరియు ప్రతిష్ఠను గూర్చి నిర్గమకాండములో చదివిన తరువాత, మరియు సీనాయి పర్వతము నుండి ఇశ్రాయేలీయులు బయలుదేరి వెళ్లడమును గూర్చి సంఖ్యాకాండములో ఉన్న కథనమునకు నడుమలో ఈ న్యాయవిధులను ఇవ్వడమును గూర్చిన నివేదికను లేవీయకాండములో చదువుతాము. కనాను దేశములోనికి ప్రవేశించడానికి ప్రజలు సీనాయి పర్వతమును వదిలి వెళ్ళారు.

ఈ పుస్తకములో రెండు చారిత్రిక భాగములు ఉన్నాయి. మొదటిది, లేవీయకాండము 8-10 అధ్యాయములలో ఉంది, ఇందులో యాజకుల యొక్క ప్రతిష్ఠ మరియు ఆహారోను ఇద్దరు కుమారులైన అబీహు నాదాబు అనువారల అవిధేయత ఆ తరువాత వారు పొందిన శిక్షను గూర్చిన కథనమును గూర్చి చదువుతాము. రెండవది, లేవీయకాండము 24:10-23లో, మిశ్రమ వివాహము ద్వారా పుట్టిన దేవదూషకునికి ఏమి జరిగినదో దానిని గూర్చి చదువుతాము.

## ఉద్దేశము, ఉద్ఘాటన, మరియు విషయములు

ఇశ్రాయేలు వారు దేవునికి నిజమైన "పరిశుద్ధ జనాంగము"గా ఉండునట్లు పరిశుద్ధతను పెంపొందించడమే లేవీయకాండము యొక్క ఉద్దేశము. కాబట్టి,

లేవీయకాండము మొత్తము పుస్తకము యొక్క ఉద్ఘాటన కూడా "పరిశుద్ధతయే." ఈ అంశము 11:44, 45లో "నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులై యుండుడి" అని దేవుడు పదేపదే చెప్పిన సందర్భములో వ్యక్తమౌతుంది.

ఈ పుస్తకములోని అనేకమైన విషయములు పలువిధములుగా ఈ అంశమునకు అనుసంధానముగా కనబడుతున్నాయి:

*దేవుని పరిశుద్ధత అనేది తన చిత్తము పట్ల విధేయతను కోరుతుంది.* నాదాబు మరియు అబీహు విషయములో జరిగిన విధానమువలె ఆయనకు విధేయులగుటలో విఫలమవ్వడం వలన విపత్కరమైన పరిణామాలు వస్తాయి. దేవుడు సమూలముగా పరిశుద్ధుడు గనుక, 24వ అధ్యాయములోని దేవదూషకుడు తెలుసుకున్నట్లుగా ఆయన నామము దూషింపబడకూడదు.

*ఇశ్రాయేలు వారిచే పరిశుద్ధత పాటింపబడడం అనేది ధర్మశాస్త్రము నందు తెలుపబడిన ఆచారములను ప్రజలు చాలా జాగ్రత్తగా అనుసరించుటలో ఉంటుంది.* ఈ ఆచారములలో ధర్మశాస్త్రమునందు పొందుపరచబడియున్న బలులను అర్పిస్తూ దానియందలి పండుగలను విశ్రాంతి దినములను ఆచరించడం అనేవి ఉన్నాయి. మరి యే ఇతర పుస్తకములో కంటే కూడా లేవీయకాండములోనే ధర్మశాస్త్రములోని బలుల విధానాన్ని మరియు ఉత్సవాలు మరియు పండుగల వ్యవస్థ క్షుణ్ణంగా తెలియపరచబడినది.

*దేశము యొక్క పరిశుద్ధత విషయములో యాజకులు చాలా ప్రాముఖ్యమైన పాత్రను పోషించారు.* మోషేకు అందించబడిన న్యాయవిధులలో కొన్ని మాత్రమే యాజకులకు అందించబడవలసినవిగా ఈ పుస్తకము చెప్తుండగా, లేవీయకాండములో దాగియున్న న్యాయవిధులు అన్నిటిని గూర్చి వారికి తెలుసును. ఈ న్యాయవిధులను వారు ప్రజలకు కూడా చేరవేయాలి, మరియు ఆ న్యాయవిధులు చేయబడునట్లు కూడా చూచే బాధ్యత వారిపైనే ఉంది. బలులు అర్పింపబడునప్పుడు దేవుని న్యాయవిధులకు ప్రజలు విధేయులగునట్లు చూచుటకు యాజకులు బాధ్యత కలిగియుండగా, లేవీయకాండము "యాజకుల చేపుస్తకము" అని పిలువబడింది.[18]

*పరిశుద్ధమైన జీవితమును జీవించుటకు ఇశ్రాయేలు ప్రజలు పిలువబడ్డారు.* ధర్మసంబంధమైన ఆచారములపై లేవీయకాండము ఎక్కువగా దృష్టి నిలుపుతున్నప్పటికీ, ఇశ్రాయేలు ప్రజలపై వ్యక్తిగతముగా విధిగా ఉంచబడిన నైతిక మరియు ధార్మిక విధులు కూడా అందులో ఉన్నాయి. సగటు ఇశ్రాయేలీయుడు, ఉదాహరణకు తీసుకుంటే, కేవలము అర్పణలను అర్పిస్తూ పండుగలను నమ్మకముగా ఆచరిస్తే మాత్రమే సరిపోదు; తననువలె తన పొరుగువానిని ప్రేమించి తగు విధముగా అతని పట్ల ప్రవర్తింపవలసిన బాధ్యత కూడా ఆయనపై ఉంది (19:18).

## క్రైస్తవులకు విలువైన పుస్తకము

క్రైస్తవులకు లేవీయకాండము చాలా అర్థవంతమైన పుస్తకము అనడానికి ఆధారము క్రొత్తనిబంధనలో ఈ పుస్తకమును ఉల్లేఖనముగా చెప్పిన లేదా ఈ పుస్తకములోని మాటలను చర్చించిన సందర్భములు దరిదాపుగా ముప్పది

పర్యాయములు ఉన్నాయి అనే వాస్తవము.[19] ఇట్టి ఆధారము ఉన్నప్పటికీ కూడా, పాతనిబంధనలోని అనేకమైన ఆచారములను గూర్చి మాట్లాడే పుస్తకము నేటికాలములో మనకు అంతటి ప్రాధాన్యమైనది కాదు అని మనము అనుకొనే వీలు ఉంది. అయినప్పటికీ, అనేక విధములుగా లేవీయకాండము క్రైస్తవులకు కూడా ఉపయోగమే.

మొదటిగా, "పరిశుద్ధత"పై ఈ పుస్తకము చేసే ఉద్ఘాటన క్రైస్తవులందరికీ నేరుగా వర్తిస్తుంది. "నేను పరిశుద్ధుడనై యున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడని వ్రాయబడియున్నది. కాగా మీరు విధేయులగు పిల్లలై, మీ పూర్వపు అజ్ఞానదశలో మీకుండిన ఆశల ననుసరించి ప్రవర్తింపక, మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడైయున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులైయుండుడి" అని మనము చెప్పబడ్డాము (1 పేతురు 1:15, 16).

రెండవదిగా, లేవీయకాండములో వివరించిన జంతుబలులు "లోకపాపములను మోసుకొనిపోయే దేవుని గొఱ్ఱెపిల్ల" యైన (యోహాను 1:29; చూడండి హెబ్రీ. 9:7-15), మనందరి కొరకు ఒక్కసారే తన్నుతాను బలిగా అర్పించుకొనిన యేసుక్రీస్తునకు సూచనగా ఉంది. ఆ జంతుబలులను గూర్చి మరెక్కువగా నేర్చుకోవడం ద్వారా, క్రైస్తవులు క్రీస్తు యొక్క బలిని మరింతగా అభినందించగలుగుతారు. పాపపరిహార క్రమములో పాతనిబంధనలో రక్తమును చిందించడమును గూర్చిన దేవుని ఉద్దేశము నేటి మన పాపములకు పరిహారము విషయములో క్రీస్తు యొక్క రక్తమును చిందించవలసిన ఆవశ్యకత ఉన్నదని వివరించుటకు సహాయపడుతుంది (17:11; చూడండి ఎఫెసీ. 1:7; హెబ్రీ. 9:22).

మూడవదిగా, ఇశ్రాయేలీయులు బలులను అర్పించాలని దేవుడు కోరడం అనేది నేటికాలములో క్రైస్తవులు ఆత్మసంబంధమైన అర్పణలను అర్పించాలని దేవుడు కోరడమునకు సాదృశ్యముగా ఉంది. ఉదాహరణకు, దేవుని సేవించి మంచి క్రియలను మనము చేసినప్పుడు మన దేహములను దేవునికి సజీవయాగములుగా అర్పిస్తాము (రోమా. 12:1, 2). మన పెదవులతో మనము దేవునికి "జిహ్వాఫలము"ను అర్పిస్తాము (హెబ్రీ. 13:15). సువార్తను ప్రకటించే విషయములో మనము ఇచ్చే ఆర్థిక చేయూత "మనోహరమైన సువాసనయు, దేవునికి ప్రీతికరమును ఇష్టమునైయున్న యాగముగా" ఉన్నవి (ఫిలిప్పీ. 4:18).

నాల్గవదిగా, ఆచారములపై ఈ పుస్తకము చేస్తున్న ఉద్ఘాటన ధర్మసంబంధమైన ఆచారముల విషయములో క్రైస్తవులకుండవలసిన భావమును గూర్చి పునరాలోచన చేయుటకు సహాయపడాలి. ఆచారము యొక్క ప్రాముఖ్యతను మనము తక్కువగా చూడవచ్చు లేదా "కేవలము ఒక ఆచారమే" అని లేదా "ఖాళీ ఆచారము" అని మనము దాని గూర్చి యోచించవచ్చు. లేవీయకాండము సరియైన విధానములో ఆచరించే ఆచారమును గూర్చి సరిగా ఆలోచించులాగునా మనలను నడిపించాలి, అంటే వీటిని అనుసరించే వారికుండే హృదయపూర్వకమైన ధ్యానము మరియు మనఃపూర్వకమైన పాలుపంపును గూర్చి కూడా ఆలోచన చేయాలి.

అయిదవదిగా, ఈ పుస్తకములో ఉన్న నైతికమైన బోధలు మరియు ధార్మికమైన న్యాయవిధులు క్రైస్తవులకు ఉపదేశయుక్తముగా ఉన్నాయి. మునుపటి నిబంధన అనేది

తొలగింపబడినది అనేది వాస్తవమే (గలతీ. 3:24, 25; కొలస్సీ. 2:14; హెబ్రీ. 7:12). అయినప్పటికీ, దానిలోని ధర్మసంబంధమైన కట్టడలు క్రొత్తనిబంధనలో ఉన్న నైతిక మరియు ధార్మిక అవసరతలకు పెద్దగా వ్యత్యాసమైనవిగా మాత్రము లేవు. దేవుని ప్రేమించడం మరియు పొరుగువానిని ప్రేమించడం అనే రెండు గొప్పవైన ఆజ్ఞలపైనే ధర్మశాస్త్రము ఆధారపడియున్నది అని యేసే చెప్పాడు (మత్తయి 22:37-40; మార్కు 12:29-31). "ధర్మశాస్త్రమంతయు - నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుము అను ఒక్క మాటలో సంపూర్ణమైయున్నది" అని గలతీయులకు 5:14 చెప్తుంది.

ఉదాహరణకు, లేవీయకాండము 19వ అధ్యాయములో ఇవ్వబడిన కొన్ని కట్టడల వంటి ప్రత్యేకమైన వాటి వెనుకనున్న నియమములు నేటి కాలములోని క్రైస్తవుల జీవితములకు అన్వయింపబడగలవు మరియు అన్వయింపబడాలి, ఎందుకంటే "నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించడం" అంటే అసలైన అర్థమేమిటో అవి ఉదాహరిస్తున్నాయి (19:18).

క్రీస్తు బలి ద్వారా మనము రక్షింపబడినప్పుడు మాత్రమే క్రైస్తవులముగా మనము పరిశుద్ధులము కాగలము అనే విషయాన్ని లేవీయకాండము మనకు జ్ఞాపకము చేయాలి. పాతనిబంధనలోని బలుల వ్యవస్థలో రక్తము యొక్క విలువ ఎంతగా ఉన్నదో, అదేవిధముగా మనము రక్తము ద్వారా - క్రీస్తు రక్తము ద్వారా - రక్షింపబడ్డాము. కాబట్టి మనము పరిశుద్ధులముగా ఉండాలి. దేవుని కృప ద్వారా మరియు క్రీస్తు రక్తములో మనము నిత్యము కడుగబడడం ద్వారా, దేవుని ధర్మశాస్త్రమునకు విధేయులగుట ద్వారా మనలను మనము లోకములో నుండి వేరుపరచుకొనినప్పుడు మనము పరిశుద్ధులముగా ఉండగలుగుతాము.

## సంక్షిప్త వర్ణన

*NRSV Harper అధ్యయన బైబిల్* అనే గ్రంథము లేవీయకాండమునకు ఈ క్రిందివిధమైన ప్రాథమిక సంక్షిప్త వర్ణనను ఇస్తుంది:

I. పరిశుద్ధుడైన దేవుని చేరుట కొరకైన మార్గము (1-16)
II. పరిశుద్ధుడైన దేవునితో సహవాసమును కలిగియుండడం (17-27)[20]

ఈ సంక్షిప్త వర్ణన ప్రకారముగా, ఒకరు క్షమాపణను పొందుకొని కృపద్వారా దేవునితో సరియైన సహవాసమును ఎలా కలిగియుండగలరో ఈ పుస్తకము యొక్క మొదటి భాగము చర్చిస్తుంది. కాగా రెండవ భాగములో ఒకరు ఆ విధమైన సహవాసమును ఎలా కొనసాగించగలరు అనే విషయాన్ని గూర్చి చర్చిస్తుంది.

మరొక మూలము ఈ సంక్షిప్త వర్ణన ఈ క్రింది విధముగా ఉంది:

I. అర్పణలు (1-7)
  A. సాధారణ నియమములు (1:1-6:7)
  B. యాజకత్వపు నియమములు (6:8-7:38)

II. యాజకత్వము (8-10)
  A. ప్రతిష్ఠించడం (8)
  B. పదవిలో నిలువబెట్టడం (9)
  C. అవిధేయత వలన కలిగిన పరిణామములు (10)

III. పవిత్రములు మరియు అపవిత్రములు (11-16)
  A. నియమములు (11-15)
  B. ప్రాయశ్చిత్తార్థ దినము (16)

IV. పరిశుద్ధత కొరకైన నియమము (17-27)
  A. రక్తము యొక్క పవిత్రత (17)
  B. నైతిక విధులు (18-20)
  C. యాజకత్వపు నియమములు (21; 22)
  D. ఆరాధనా క్యాలెండరు (23)
  E. నూనె, రొట్టె, మరియు దేవదూషణ (24)
  F. విశ్రాంతి సంవత్సరము మరియు హితవత్సరము (25)
  G. బహుమానములు మరియు శిక్షలు (26)
  H. మ్రొక్కుబడులు మరియు దశమభాగములు (27)[21]

ఈ అధ్యయనములో ఈ క్రింద తెలుపబడిన ప్రాథమిక సంక్షిప్త వర్ణనను అనుసరించబడినది:

I. పరిశుద్ధతను పొందుకొనుట (1-16)
  A. అర్పణముల ద్వారా (1-7)
  B. ప్రతిష్ఠితమైన యాజకత్వము ద్వారా (8-10)
  C. పవిత్రమైన మరియు అపవిత్రమైన వాటిని విభజించడం ద్వారా (11-15)
  D. ప్రాయశ్చిత్తార్థ దినమును ఆచరించుట ద్వారా (16)

II. పరిశుద్ధతను అభ్యసించుట (17-27)
  A. దేవుని నైతికమైన మరియు ధార్మికమైన న్యాయవిధులను అనుసరించుటయందు వ్యక్తిగత బాధ్యత (17-20)
  B. యాజకుల యొక్క బాధ్యతలు (21; 22)
  C. పరిశుద్ధతను పెంపొందించుటయందు దేశము యొక్క బాధ్యత (23-25)
  D. పరిశుద్ధతను అనుసరించుటకు గల కారణము: ఆశీర్వాదములు మరియు శాపములు (26)
  E. పరిశుద్ధతకు గల ఆధారము: మ్రొక్కుబడులు మరియు మూల్యములు (27)

## పరిశుద్ధమైన జనాంగము

తన ప్రజలైన ఇశ్రాయేలును దేవుడు ఐగుప్తుదేశము నుండి బలమైన హస్తముతో విడిపించాడు అని నిర్గమకాండములో మనము చదువుతాము. వారిని ఆయన సీనాయి పర్వతమునకు నడిపించి వారితో ఒక నిబంధనను చేసాడు. వారు ఆయనకు విధేయులైయున్న యెడల, వారు ఆయనకు ఏర్పరచబడిన జనాంగముగా ఉందురు అని ఆయన వారితో చెప్పాడు (నిర్గమ. 19:5). వారు ఆయనకు "యాజక రూపకమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను" ఉండవలసిన వారు (నిర్గమ. 19:6).

ఇది ఒక ప్రశ్నను లేవనెత్తుతుంది: "పరిశుద్ధమైన జనము"గా ఉండడం అంటే ఏమిటి?

పంచగ్రంథములలోని మిగిలిన గ్రంథములలో దేవుడు ఈ ప్రశ్నకే జవాబునిస్తూ ఇశ్రాయేలీయులు ఎలా జీవించాలి మరియు ఆయనను ఎలా ఆరాధించాలి అనే విషయాలపై వారికి కొన్ని నిర్దేశకములు ఇచ్చాడు. కానీ, తన ప్రజలు నిజముగా ఒక పరిశుద్ధమైన జనముగా ఆయనకు ఉండునట్లు వారినుండి ఆయన ఏమి ఆశిస్తున్నాడో లేవీయకాండము పుస్తకములో ప్రత్యేకముగా వివరించబడినది.

లేవీయకాండము యొక్క అంశము పరిశుద్ధత, మరియు ఈ అంశము 11:44, 45 వచనములలో ఐగుప్తు దాస్యమునుండి తన ప్రజలైన ఇశ్రాయేలీయులను విడిపించిన దేవుడు పదేపదే వారితో, "నేను పరిశుద్ధుడను గనుక మీరును పరిశుద్ధులై" యుండుడి అని చెప్పిన సందర్భములలో చాల స్పష్టపరచబడినది (చూడండి 19:2; 20:26).

"ఇది ఆసక్తికరముగా ఉన్నది, కాని ఇది మనకు ఏ విధంగా వర్తిస్తుంది? అది అప్పుడు; ఇది ఇప్పుడు. పరిశుద్ధముగా ఉండటానికి ఇశ్రాయేలీయులకు సహాయపడిన ఆ న్యాయవిధులకు నేటి క్రైస్తవులకు మధ్యగల సంబంధం ఏమిటి?" అని మనము ఆలోచించవచ్చు.

మొదటి నిబంధన తొలగించబడినది గనుక సాధారణముగా పాతనిబంధన మనకు నేరుగా వర్తించదు అనే మాట వాస్తవము (చూడండి రోమా. 15:4; 1 కొరింథీ. 10:11). క్రొత్తనిబంధనను వ్రాసిన ప్రేరేపిత రచయితలు మరియు సువర్తికులు మనకు అన్వయింపజేసిన యెడల, ఇది నేటికి కూడా మనకు సరిపడినదే అని మనము తెలుసుకొనగలము. లేవీయకాండము 11:44, 45 వచనముల విషయములో కూడా ఇదే వాస్తవము. ఆ వాక్యభాగము నుండి మాట్లాడుతూ పేతురు ఈ విధంగా వ్రాస్తున్నాడు,

> నేను పరిశుద్ధుడనై యున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడని వ్రాయబడియున్నది. కాగా మీరు విధేయులగు పిల్లలై, మీ పూర్వపు అజ్ఞానదశలో మీకుండిన ఆశల ననుసరించి ప్రవర్తింపక, మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడైయున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులైయుండుడి (1 పేతురు 1:15, 16).

"పరిశుద్ధులై యుండుడి" అని ఇశ్రాయేలీయులతో చెప్పబడిన ఆజ్ఞ సంఘమునకు కూడా వర్తిస్తుందని పేతురు స్పష్టముగా చెప్పాడు. "సజీవమైన రాళ్ల"మైన మనము

“యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మా సంబంధమైన బలులనర్పించుటకు పరిశుద్ధయాజకులుగా ఉండునట్లును, ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడుచున్నాము” అని 1 పేతురు 2వ అధ్యాయములో అపొస్తలుడు క్రైస్తవులతో మాట్లాడుతూ ఈ సత్యాన్నే మరల ఉద్ఘాటిస్తున్నాడు (1 పేతురు 2:5). కొన్ని వచనముల తరువాత, క్రైస్తవులను గూర్చి మాట్లాడుతూ వారు “చీకటిలో నుండి ఆశ్చర్యమైన తన వెలుగులోనికి . . . ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజకసమూహమును, పరిశుద్ధజనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు” అని అంటున్నాడు (1 పేతురు 2:9). ఈ వాక్యభాగము ప్రకారముగా, పాతనిబంధన కాలములో ఇశ్రాయేలీయులు ఏవిధమైన స్థానమును కలిగియున్నారో నేటి సంఘము కూడా అదే స్థానములో ఉన్నది. వారు “పరిశుద్ధమైన జనము”; మనము కూడా “పరిశుద్ధ జనము”గా ఉండాలి. ఇంకా చూస్తే, ప్రభువు పరిశుద్ధుడు గనుక, వారు పరిశుద్ధులై యుండాలి. ఇదే విధంగా, దేవుడు పరిశుద్ధుడు గనుక, మనము కూడా పరిశుద్ధులమై యుండాలి.

ఇశ్రాయేలీయులు పరిశుద్ధులుగా ఉండాలి అనుటలో అర్థము ఏమిటి? ఈ ప్రశ్నకు స్పందించేటప్పుడు, నేటి కాలములో సంఘముకూడా పరిశుద్ధముగా ఉండాలి అనుటలోగల అర్థము మనకు బాగా అర్థమౌతుంది. పరిశుద్ధత అనే విషయముపై లేవీయకాండము ఏ విధమైన జ్ఞానాన్ని మనకు అందించగలదో, ఇశ్రాయేలీయులకును మరియు నేటి క్రైస్తవులకును, దానిని మనము పరిశీలన చేయాలి.

## ఆ నాడు దేవుని పరిశుద్ధమైన ప్రజలు

పాతనిబంధనలోని “పరిశుద్ధత” అనే మాట హెబ్రీ పదమైన קָדוֹשׁ (*కదోష్*) నుండి, అంటే “వేరుగా,” “ప్రత్యేకపరచ [బడిన],” లేదా “పవిత్రమైన”[22] అనే అర్థమునిచ్చే పదమునుండి గ్రహించబడినది. ఈ పదమునకు “చాలా బలమైన ధార్మిక అర్థము ఉన్నది. ఒక విధముగా చూస్తే, ఈ పదము ‘పరిశుద్ధము’గా ఉండవలసిన ఒక వస్తువును లేదా ఒక స్థలమును లేదా ఒక దినమును సూచిస్తూ ఒక ఉద్దేశము కొరకు ‘వేరుపరచ’బడిన లేదా ‘ప్రతిష్ఠించ’బడిన అనే అర్థమును వివరిస్తుంది.”[23]

లేవీయకాండములో “పరిశుద్ధత” అనేది సుస్పష్టముగా ప్రాముఖ్యమైన అంశము. ఈ పుస్తకములో “పరిశుద్ధ” అనే మాట డెబ్బై వచనములలో తొంబై సార్లు ఉంది (NASB అనువాదములో). “పరిశుద్ధ”మైనదిగా లేవీయకాండములో చెప్పబడినవి ఈ విధంగా ఉన్నాయి: (1) ఇశ్రాయేలు దేవుడైన యెహోవా పరిశుద్ధుడు; ఆయన నామము పరిశుద్ధము మరియు దానిని అపవిత్రపరచకూడదు (లేవీయ. 11:44, 45; 20:3; 21:8; 22:32). ఆయనను “పరిశుద్ధుని”గానే చూడాలి (10:3). (2) దేవుడు పరిశుద్ధుడు గనుక, ప్రజలు కూడా పరిశుద్ధులుగానే ఉండాలి (11:44, 45; 19:2; 20:26). (3) ప్రత్యక్ష గుడారము పరిశుద్ధమైనది, దానితోబాటు గుడారము చుట్టూ ఉన్న ప్రాంగణము కూడా పరిశుద్ధమే. బయటి ప్రాంగణమును “పరిశుద్ధ స్థలము”గా పిలిచేవారు మరియు లోపలి ప్రాంగణమును “అతి పరిశుద్ధ స్థలము”గా లేదా “అత్యంత పరిశుద్ధ స్థలము”గా పిలిచేవారు (చూడండి 16:2). (4) యాజకులు పరిశుద్ధమైన

వారు, మరియు వారు ధరించే వస్త్రములు కూడా పరిశుద్ధములే (8:9; 16:4; 21:6). (5) బలులు అన్నియు పరిశుద్ధమైనవే (14:13). (6) ఇశ్రాయేలీయులు ఆచరించిన పండుగ దినములన్నియు పరిశుద్ధములే (23:2). (7) యెహోవాకు అర్పించబడినది, లేదా ప్రతిష్ఠించబడినది పరిశుద్ధము (19:24; 27:9). "ప్రతిష్ఠింపబడిన దానినుండి లౌకికమైనదానిని, అపవిత్రమైనదానినుండి పవిత్రమైనదానిని" (10:10) యాజకులు మరియు ప్రజలు వేరుచేయవలసినవారిగా ఉన్నారు అనే సత్యములో పరిశుద్ధత యొక్క ప్రాముఖ్యత ఉద్ఘాటించబడినది.

ఇశ్రాయేలు దేశము "పరిశుద్ధమైన జనము"గా ఉండాలి అని ఈ లేఖనభాగము చెప్పున్నప్పుడు దాని అర్థము ఏమిటి? సాధారణంగా, రెండు విధములలో ఇశ్రాయేలీయులు ప్రత్యేకపరచబడిన ప్రజలు, ఇతర దేశముల *నుండి* వేరుపరచబడినవారిగా, మరియు దేవుని పని *కొరకు* వేరుపరచబడినవారిగా.

1. ఇతర రాజ్యముల *నుండి* వేరుపరచబడడం. ఈ సత్యము 11:44, 45 వచనములలో ఉద్ఘాటించబడినది, అక్కడ దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తునుండి విడిపించాడు అని వ్రాయబడి ఉంది. ఫలితముగా, వారు ఆయనకు ప్రజలుగా అయ్యారు మరియు ఆయన వారికి దేవుడు అయ్యాడు. తమను తాము "ప్రతిష్ఠపరచుకొనమని," "పరిశుద్ధులుగా" ఉండమని మరియు తమ్మునుతాము "అపవిత్ర"పరచుకొనకూడదని కూడా దేవుడు వారితో చెప్పాడు. ఐగుప్తు దేశమునుండి తన ప్రజలను దేవుడు విడిపించినప్పుడు, లోకములోని జనములన్నిటిలోకెల్లా వారు చాలా ప్రత్యేకముగా ఉండవలెనని వారికి చెప్పాడు. దేవుడు మోషేద్వారా ఇశ్రాయేలుతో మాట్లాడుతూ ఇలా అన్నాడు: "నీవు నీ దేవుడైన యెహోవాకు ప్రతిష్ఠిత జనము, నీ దేవుడైన యెహోవా భూమిమీదనున్న సమస్త జనములకంటె నిన్ను ఎక్కువగా ఎంచి, నిన్ను తనకు స్వకీయజనముగా ఏర్పరచుకొనెను" (ద్వితీ. 7:6; చూడండి 14:2). మోషే కాలములో (తరువాత కాలములో యూదులుగా పిలువబడిన) ఇశ్రాయేలీయులు ప్రత్యేకముగా దేవుని యొక్క ప్రజలే.

వారు దేవుని ప్రత్యేకమైన ప్రజలు గనుక, వారి చుట్టునున్న దేశముల వారు చేసే పాపములు వారిని అంటకుండా వారు తమనుతాము కాపాడుకోవాలి. దేవుడు ఇశ్రాయేలీయులను ఈ విధంగా ఆజ్ఞాపించాడు, "కాబట్టి మీకంటె ముందుగా నున్నవారు అనుసరించిన ఆ హేయమైన ఆచారములలో దేనినైనను అనుసరించుటవలన అపవిత్రత కలుగజేసికొన కుండునట్లు నేను మీకు విధించిన విధి ననుసరించి నడుచు కొనవలెను. నేను మీ దేవుడనైన యెహోవాను" (లేవీయ. 18:30; చూడండి 20:23). ఇతర పాతనిబంధన వాక్యభాగములు కూడా ఈ విషయాన్ని ఉద్ఘాటిస్తున్నాయి. ద్వితీయోపదేశకాండము 18:9లో, "నీ దేవుడైన యెహోవా నీకిచ్చుచున్న దేశమున నీవు ప్రవేశించిన తరువాత ఆ జనముల హేయకృత్యములను నీవు చేయ నేర్చుకొనకూడదు" అని చదువుతాము. ఈ బాధ్యతకు తగినట్లుగా ఇశ్రాయేలు జీవించలేదు గనుక, ఆఖరుకు దేవుడు తన ప్రజలను బంధకములోనికి అప్పగించినప్పుడు ఆ దేశము శిక్షించబడినది (మరియు పవిత్రపరచబడినది).

రాజీపడడం అనేది చాల మంచి పనే అని మనం చాల సార్లు భావిస్తుంటాము. కానీ, పాతనిబంధన కాలములో, దేవుని ప్రజలను నాశనము చేసి దేవుని ప్రణాళికను

నీరుగార్చడానికి అపవాది ప్రయోగించిన అతిపెద్ద కుతంత్రము రాజీపడడం. ఇశ్రాయేలు దేవుడైన యెహోవాను ఆరాదిస్తూనే కూడా తమ చుట్టూ ఉన్న ప్రజల దేవతలను ఆరాధిస్తూ ఆ దేశములను పోలి నడచుకొనుటకు ప్రయత్నించులాగున ప్రజలు ప్రేరేపింపబడ్డారు.

అయినప్పటికీ, తన ప్రజలచే ఆరాధింపబడే వారిలో కేవలం ఆయన మాత్రమే దేవునిగా ఉండాలి అని దేవుడు ఖండితముగా చెప్పాడు. వారికి పది ఆజ్ఞలను ఇచ్చుట ద్వారా దేవుడు ఈ క్రింది విధముగా చెప్పాడు,

> నీ దేవుడైన యెహోవాను నేనే; నేనే దాసుల గృహమైన ఐగుప్తుదేశములోనుండి నిన్ను వెలుపలికి రప్పించితిని; నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు. పైన ఆకాశామందేగాని క్రింది భూమియందేగాని భూమిక్రింద నీళ్లయందేగాని యుండు దేని రూపమునయినను విగ్రహమునయినను నీవు చేసికొనకూడదు; వాటికీ సాగిలపడి వాటిని పూజింపకూడదు. ఏలయనగా నీ దేవుడనైన యెహోవానగు నేను రోషముగల దేవుడను . . . (నిర్గమ. 20:2-5).

ఇతర దేశములకు చెందిన దేవతలనుండి తమను తాము వేరుపరచుకొనులాగున ఇశ్రాయేలీయులకు ఈ లేవీయకాండము పుస్తకము పిలుపును ఇస్తుంది. లేవీయకాండము 19:4లో, “మీరు వ్యర్థమైన దేవతలతట్టు తిరుగకూడదు. మీరు పోతవిగ్రహములను చేసికొనకూడదు. నేను మీ దేవుడనైన యెహోవాను” అని చదువుతాము.

తమ చుట్టూ ఉన్న ప్రజల విషయములో ఇశ్రాయేలీయులు రాజీపడి యెహోవాతో పాటుగా వారి దేవతలను కూడా పూజించడం మొదలుపెట్టినప్పుడు, తన ప్రజలను దేవుడు శిక్షించవలసి వచ్చినది. పరిశుద్ధతలో మొదటి పరీక్షలో వారు విఫలమయ్యారు - అదేమనగా, ఇతర దేశముల నుండి మరియు వారి దేవతారాధన నుండి తమను తాము వేరుపరచుకొనుటలో విఫలమయ్యారు.

2. దేవుని పని *కొరకు* వేరుపరచబడడం. దేవుని ఉద్దేశముల కొరకు ఇశ్రాయేలీయులు తమ్ముతాము వేరుపరచుకొనవలసినవారిగా ఉన్నారు. పరిశుద్ధత అనే ఆలోచనలో దేవుని పని కొరకు ప్రత్యేకపరచబడడం అనే అర్థము కూడా ఉన్నది. తన ప్రజలు పరిశుద్ధతను చూపించవలసినవారు - అంటే కేవలము అన్యదేవతారాధన నుండి తమను వేరుపరచుకోవడంలో మాత్రమే కాదు గాని దేవుడైన యెహోవాను ఆరాధించుటలోను మరియు ఆయనను సేవించుటలోను కూడా తమనుతాము ప్రత్యేకపరచుకొనవలసినవారుగా ఉన్నారు.

దేవుని పట్ల ఇశ్రాయేలీయులు ఎంత వరకు ప్రత్యేకపరచబడినవారిగా ఉండవలసినవారు? వారు ఆయన పట్ల పూర్తిగా ప్రత్యేకపరచబడి ఉండాలి! లేవీయకాండములో ఉన్న న్యాయవిధులు అనేవి కేవలము అర్పణలు మరియు ధర్మసంబంధమైన పండుగలకు మాత్రమే సంబంధించినవికాదు కానీ, ప్రజల జీవితాలలోని అనేక కోణములకు కూడా సంబంధించినవి అనే ఈ వాస్తవము ద్వారా ఆ సత్యము విదితమౌతున్నది. లేవీయకాండములో ఉన్న న్యాయవిధులకు విధేయులవ్వాలని తలంచిన ఇశ్రాయేలీయులు, తమ పరిశుద్ధత - అంటే దేవుని పట్ల

తమకున్న ప్రతిష్ఠ - వలన వారు ఎవరిని వివాహమాడుటకు అనుమతించబడ్డారు (18:1-18), పిల్లలకు మరియు తల్లిదండ్రులకు మధ్య ఎటువంటి సంబంధము నెలకొని ఉండాలి (19:3), తన యింటిలో ఉన్న సేవకుల పట్ల ఎలా ప్రవర్తించాలి (19:13), మరియు దైనందిన జీవితములోని ఇతర కోణములు వంటి విషయములు తెలుసుకొనగలుగుతారు.

లేవీయకాండమును గాక మనము మిగిలిన ధర్మశాస్త్ర గ్రంథములను పరిశీలన చేసినట్లయితే, ఇశ్రాయేలు ప్రజలు చేసిన ప్రతిదానిని గూర్చి, అది వ్యక్తిగతమైనది అయినా లేక సామూహికమైనది అయినా, దేవుడు ఏదో చెప్తున్నాడు అని మనకు అర్థమౌతుంది.[24] ఇతర మాటలలో చెప్పాలంటే, లేవీయకాండములో ఉన్న మోషే యొక్క ధర్మశాస్త్రము నిర్గమకాండము, సంఖ్యాకాండము మరియు ద్వితీయోపదేశకాండములలో ఉన్నట్లుగా మతసంబంధమైన ఆచరణలను నియంత్రించే ధర్మశాస్త్రము మాత్రమే కాదు. ఒక పరిశుద్ధమైన జనముగా ఇశ్రాయేలీయులు పిలువబడినప్పుడు, దేవునికొరకు ప్రతిష్ఠింపబడిన జనముగా వారు ఉండాలి. ఆ దినములలో, సరైన అర్పణలను తీసికొనిరావడము మరియు సరైన సమయములో సరైన స్థలములో ఆరాధించడం ద్వారా మాత్రమే దేవుడు ఒకనియందు ఇష్టతకలిగి యుంటాడు అని ఒక ఇశ్రాయేలీయుడు భావించకూడదు.

కేవలము మతసంబంధమైన క్రియల ద్వారా మాత్రమే తనయందు వారికున్న విశ్వాసమును ప్రజలు చూపించాలని దేవుడు భావించలేదు. తమ జీవితములన్నిటిని సమూలముగా ప్రభావితము చేయులాగున ఆయన పట్ల వారు ప్రతిష్ఠింపబడాలని ఆయన ఆశించాడు. పాతనిబంధన కాలములో, దేవుని కొరకు మరియు దేవుని యెడల దేవుని ప్రజలందరూ పరిశుద్ధత కలిగి, మరియు ఆయన పట్ల సంపూర్ణమైన ప్రతిష్ఠ కలిగియుండుటకు పిలువబడ్డారు. వారు చేసిన ప్రతియొక్కటి కూడా దేవుని ధర్మశాస్త్రపు వెలుగులో చేయవలసినవారిగా ఉన్నారు.

## నేటి కాలమందు దేవుని ప్రజలు

నేటికాలములో పరిశుద్ధులుగా ఉండడం అంటే ఇశ్రాయేలీయుల కాలములో ఏ అర్థము ఉండేదో అదే అర్థము ఇప్పుడు కూడా ఉంది. గ్రీకు క్రొత్తనిబంధనలో "పరిశుద్ధత" (ἅγιος, *హగియోస్*) అను మాటకు ప్రయోగించిన పదమునకు ఉన్న అర్థము పాతనిబంధనలో *కదోష్* అనే మాటకు ఉండినదే. "దాని ధార్మిక మరియు ఆత్మీయ ప్రాధాన్యతలో," ఈ పదము యొక్క అర్థము, "పాపము నుండి వేరుపరచ బడడం కాబట్టి పవిత్రుడైన దేవునికి ప్రతిష్ఠచేయబడుట."[25]

క్రైస్తవులముగా, ఇశ్రాయేలు వారు పరిశుద్ధులుగా ఉండినట్లుగానే మనము కూడా పరిశుద్ధపరచబడియున్నాము. మనము ప్రత్యేకపరచబడినవారము లేదా ప్రతిష్ఠింపబడినవారము. ఇశ్రాయేలువలెనే, మనము మన చుట్టూ ఉన్న లోకము *నుండి* ప్రత్యేకపరచబడాలి మరియు దేవుని పని *కొరకు* ప్రత్యేకపరచబడాలి.

1. లోకము *నుండి* ప్రత్యేకపరచబడడం. మనము క్రైస్తవులము అయినప్పుడు ఈ లోకములోనుండి మనము విమోచింపబడి క్రీస్తు రాజ్య నివాసులుగా చేయబడితిమి అని

క్రొత్తనిబంధన మనకు బోధిస్తుంది (కొలస్సీ. 1:13, 14). ఇతరులు ఈ లోకములో ఉన్నారు ఈ లోకమునకు చెందినవారు, కాని క్రైస్తవులమైన మనము ఈ లోకములో ఉన్నప్పటికీ కూడా ఈ "లోకమునకు చెందిన వారము కాము" (యోహాను 17:14, 16).

నేడు దేవుని ప్రజలుగా, మనము ప్రత్యేకపరచబడిన వారముగా ఉండాలి లేదా లోకములో నుండి ప్రతిష్ఠింపబడినవారముగా ఉండాలి అనే విషయాన్ని మనము మరచిపోవచ్చు. ఈ శోధన వలన, క్రైస్తవులు "క్రీస్తుయేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు" తగినట్లు జీవించవలెనని తరచుగా లేఖనముల ద్వారా చెప్పబడ్డాము (ఫిలిప్పీ. 3:14; KJV). మనకు మనము "ఇహలోకమాలిన్యము అంటకుండా" చూచుకొనవలెనని యాకోబు 1:27లో చెప్పబడ్డాము. "ఈ లోక మర్యాదను అనుసరింపక" "రూపాంతరము పొందవలె"నని పౌలు చెప్పాడు (రోమా. 12:2). "ఈ లోకమును ప్రేమింపకుడి" అని యోహాను చెప్పాడు (1 యోహాను 2:15).

ఈ హెచ్చరికలను మనము లక్ష్యపెట్టాలి. పురాతన కాలపు ఇశ్రాయేలీయులవలెనే, ఈ లోకముతో కొంతమట్టుకు రాజీపడడం వలన మనకేమీ పెద్ద ముప్పు ఉండదు అని మనము అనుకోవచ్చు. పూర్తిగా భిన్నంగా ఉండకుండా - ఇలా ఉంటే వింతగా లేదా విచిత్రముగా ఉంటుంది గనుక - అసభ్యకరమైన వస్త్రధారణపట్ల, అశ్లీలతను వినియోగించడం పట్ల, మద్యపానములో మత్తులుగా ఉండడం పట్ల, జూదము పట్ల, లేదా మనచుట్టూ ఉన్నవారివలే లైంగికమైన అనైతికతలో ఉండడం పట్ల మనము శోధింపబడవచ్చు. కొంతమంది ఈ విధంగా వాదిస్తుంటారు, "నేను నేరములు చేయనంతవరకు లేదా వేరే వారిని ఇబ్బంది పెట్టనంత వరకు లోకసంబంధమైన ప్రజల యొక్క సాధారణ ప్రవర్తనలో పాలుపొందడం వలన పెద్దగా బాధ ఏమీ కలుగదు. వారి కార్యక్రమములలో కొన్నింటిలో పాలుపొందుట ద్వారా, వారు మంచి చేయులాగున నేను వారిని ప్రభావితము చేయగలను" అంటుంటారు.

క్రొత్తనిబంధన మాత్రము వేరేవిధంగా బోధిస్తుంది. ఇతరులతో పాటుగా ముందుకెళ్లుటకు గాను వారిని అనుసరించి నడచుకొనుటకు బదులు, భిన్నముగా ఉండాలని ఇది మనకు బోధిస్తుంది: "మీరు అవిశ్వాసులతో జోడుగా ఉండకుడి . . . కావున మీరు వారి మధ్యనుండి బయలువెడలి ప్రత్యేకముగా ఉండుడి . . . ప్రభువు చెప్పుచున్నాడు (2 కొరింథీ. 6:14-17); "మోసపోకుడి. దుష్టసాంగత్యము మంచి నడవడిని చెరుపును" (1 కొరింథీ. 15:33). క్రొత్తనిబంధన క్రైస్తవులు తమ స్నేహితులతో ఈ లోకము యొక్క పాపములలో పాలుపొందలేదు అని పేతురు సాక్ష్యమిస్తున్నాడు. ఇతరులు అపరాధులుగా ఎంచబడిన కొన్ని పాపములను గూర్చి ఆయన మాట్లాడుతున్నాడు (తన చదవరులు కూడా వారు మార్పునొందుటకు మునుపు ఈ విధంగానే అపరాధులుగా ఎంచబడి ఉంటారు). వీటిలో, "పోకిరిచేష్టలు, దురాశలు, మద్యపానము, అల్లరితోకూడిన ఆటపాటలు, త్రాగుబోతుల విందులు, చేయదగని విగ్రహపూజలు." క్రైస్తవులు "అపరిమితమైన ఆ దుర్వ్యాపారమునందు తమతోకూడ పరుగెత్తకపోయినందుకు" గాను కొంతమంది "ఆశ్చర్యపడుట" మాత్రమే కాకుండా "వారిని దూషించుచున్నారు" అని పేతురు చెప్తున్నాడు (1 పేతురు 4:3, 4). ఈ "లోకమునకు వెలుగై"యుండమని యేసు మనకు ఉపదేశించాడు (మత్తయి 5:14). సుస్పష్టముగా, వెలుగు అనేది చీకటితో చాల వ్యత్యాసమైనది.

కాగా, పరిశుద్ధులుగా ఉండుటకు ప్రతిష్ఠింపబడాలి, లోకమునుండి భిన్నముగా ఉండాలి. దీని పాపపూరితమైన ప్రయోగములలో మనము పాలుపొందకూడదు.

2. దేవుడు వాడుకొనుటకు ప్రత్యేకపరచబడడం. నేటి కాలములో పరిశుద్ధులముగా ఉండడం అంటే దేవుని కొరకు మనము ప్రత్యేకముగా ఉండాలి, అంటే మనము పూర్తిగా ఆయనకు ప్రతిష్ఠింపబడి ఉండాలి. "మీలో తనకు కలిగినదంతయు విడిచి పెట్టువాడు నా శిష్యుడు కానేరడు" అని యేసు చెప్పినప్పుడు ఈ విషయమునే ఉద్ఘాటించాడు (లూకా 14:33). "ఎవడైనను నన్ను వెంబడింపగోరినయెడల, తన్నుతాను ఉపేక్షించుకొని, తన సిలువనెత్తికొని నన్ను వెంబడింపవలెను" అని ఆయన బోధించాడు (మత్తయి 16:24). "మిమ్మును మీరే దేవునికి అప్పగించుకొనుడి, మీ అవయవములను నీతిసాధనములుగా దేవునికి అప్పగించుడి" అని వ్రాసినప్పుడు క్రైస్తవులు తమనుతాము దేవునికి ప్రతిష్ఠించుకోవాలని పౌలు బోధించాడు (రోమా. 6:13). మరలా, రోమీయులకు చెప్తూ, "పరిశుద్ధమును దేవునికి అనుకూలమైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను" అని అన్నాడు (రోమా. 12:1). మరొక పత్రికలో, ఈ విధమైన ప్రతిష్ఠకు ఉదాహరణగా మాసిదోనియాలోని వారిని గూర్చి చెప్తూ, "వారు మొదట ప్రభువునకు తమ్మును తామే అప్పగించుకొనిరి" అన్నాడు (2 కొరింథీ. 8:5).

క్రైస్తవునిగా ఉండడం అంటే ప్రతి ఆదివారము కూడా పరిశుద్ధులందరితో కలిసి ఆరాధనకొరకు కూడుకోవడం, ప్రభువు బల్లలో పాలుపొందడం, పాటలను పాడడం, స్తుతించడం, లేఖనమును చదివి అధ్యయనం చేయడం, మరియు ప్రభువు కొరకు మన ధనమును ఇవ్వడము వంటివి కాక మరింత ఎక్కువయైన కార్యములే ఉంటాయి. మనము చేస్తున్న ప్రతిదానిని మన క్రైస్తవ్యము ప్రభావితము చేయాలి.

నేటి కాలములో పరిశుద్ధులుగా ఉండడం అంటే ఏమిటి? పాపము చేయకుండా దూరముగా ఉండడమే కాకుండా, మనకు మనముగా దేవునికి పూర్తిగా ఇచ్చుకోవడం కూడా ఇందులో భాగమే. ఈ లోకములోనుండి వేరుపరచబడిన క్రైస్తవులముగా, మనము దేవుని కొరకు ప్రత్యేకపరచబడి, ఆయనకు ప్రతిష్ఠింపబడి, క్రీస్తు కొరకు పరిశుద్ధపరచబడాలి!

## ముగింపు

మనము లేవీయకాండమును చదవడం ప్రారంభించినప్పుడు, మనకు ఈ పుస్తకములో అసలు ఏవిధమైన విలువ ఉంది అని మనము ఆశ్చర్యపడవచ్చు. అర్పణలు, అపవిత్రత, మరియు యూదుల పండుగలను గూర్చే ఎక్కువగా ఇందులో ఉంటుంది! మనము ఈ న్యాయవిధులచే బంధింపబడియుండలేదు, మరి వాటిపట్ల మనమెందుకు ఆసక్తిని కనబరచాలి?

ఈ ప్రశ్నకు ఒక సమాధానం, ఇశ్రాయేలీయులు "పరిశుద్ధమైన జనము"గా మారుటకు సహాయపడుటకు లేవీయకాండము ఇవ్వబడినది. జాగ్రత్తగా ఈ పుస్తకమును చదవడం మరియు అర్థం చేసుకోవడం ద్వారా దేవుని సంఘముగా

దేవుడు మన విషయములో ఆయనకు "పరిశుద్ధమైన జనము"గా ఉండాలని అనుకున్నట్లుగా మనము ఉండగలము. పరిశుద్ధత అనేది మననుండి ఏమి ఆశిస్తుందో అనే వాటిని గూర్చి తెలుసుకోవడం ద్వారా ఈ లేవీయకాండమును చదువుతున్నప్పుడు మరియు ఇశ్రాయేలు "పరిశుద్ధ జనము"గా ఉండమనినప్పుడు దాని అర్థము ఏమైయున్నదో అనేది మనకు మరింతగా విదితమౌతుంది.

Coy D. Roper

---

సూచనలు

[1]ఆంగ్లభాషలోని పాతనిబంధనలో ఉన్న మిగతా నాలుగు భాగములు చరిత్ర, పద్యభాగము, పెద్ద ప్రవక్తలు, మరియు చిన్న ప్రవక్తలు. ధర్మశాస్త్రము (*Torah*) కాకుండా, హెబ్రీ బైబిల్ అనునది ప్రవక్తలు (*Nebi'im*) మరియు ఇతర రచనలు (*Kethubim*)గా కూడా విభజింపబడినది. [2]హెబ్రీ బైబిల్ లో చూచినట్లయితే, పంచగ్రంథములో ఉన్న అయిదు పుస్తకముల యొక్క పేరు ఆ లేఖనభాగములోని మొదటి మాటను అనుసరించి తీసికొనబడినది. [3]ఈ గోత్రము యాకోబు మూడవ కుమారుడైన లేవి పేరుతో నామకరణము చేయబడినది. యాజకులు లేవీ గోత్రమునకు చెందినవారు గనుక వీరిని "లేవీయులు" అన్నారు; కాని వీరు ఇతర లేవీయుల కంటే భిన్నమైన వారు ఎందుకంటే వీరందరూ కూడా మొట్టమొదటి ప్రధాన యాజకుడైన అహరోను యొక్క సంతతివారు. మరొక విధంగా చెప్పాలంటే, యాజకులందరూ లేవీయులే, కాని లేవీయులందరూ యాజకులు కారు. ఇశ్రాయేలీయులు చేసే ఆరాధనా కార్యక్రమములన్నిటిలో యాజకులు పాలుపంచుకొనేవారు, కాని లేవీయులు వీరికి పరివిధములుగా సహకరించేవారు. [4]లేవీయులు ఇతర బాధ్యతలు కూడా ఇవ్వబడ్డారు. ఉదాహరణకు (యాజకులతో పాటుగా) దేవుని ధర్మశాస్త్రమును వారు ప్రజలకు బోధింపవలసినవారిగా ఉన్నారు (10:11; ద్వితీ. 33:8, 10; 2 దిన. 17:7-9; 35:3; నెహెమ్యా 8:7, 8). [5]యాకోబు పండ్రెండ్రు కుమారులలో ఇద్దరైన లేవీ మరియు యోసేపు అనువారల పేరులు ఇశ్రాయేలు పండ్రెండ్రు గోత్రముల జాబితాలో లేవు. దీనికి బదులు, యోసేపు ఇద్దరు కుమారులైన ఎఫ్రాయీము మరియు మనష్షే అనువారు ఈ పండ్రెండ్రు గోత్రములలో రెండు గోత్రములకు మూలపురుషులు అయ్యారు. [6]ఈ విషయములో అధిక సమాచారమును ఈ పుస్తకములో చూడవచ్చు. Coy D. Roper, *Numbers*, Truth for Today Commentary (Searcy, Ark.: Resource Publications, 2012), 525-34. [7]మెట్టుకు, 2 తిమోతి 3:16, 17 వచనములలో చెప్పబడినట్లుగా లేవీయకాండములోని విషయములన్నియు కూడా దేవుని నుండే ఉద్భవించినవి. [8]R. K. Harrison వ్రాస్తూ, "[ఎజ్రా కాలము] మొదలుకొని యూదా మతము, ఇస్లాము, మరియు క్రైస్తవ్యము కూడా మోషే విషయములో కేవలము దైవికముగా ప్రత్యక్షపరచబడిన న్యాయవిధులను [పంచగ్రంథములలో] అందజేసిన మధ్యవర్తిగా మాత్రమే కాకుండా, ఈ పంచగ్రంథముల మొత్తాన్ని వ్రాసిన రచయితగా కూడా అంగీకరించాయి . . . ఫిలో, యోసీఫసు, మరియు మిష్నా మరియు తాల్ముడ్ అధికారులు కూడా ఏవిధమైన సందేహమూ లేకుండా మోషేయే ఈ Torahను వ్రాసాడు అని అంగీకరించారు" అన్నాడు. (R. K. Harrison, *Introduction to the Old Testament* [Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1969], 497.) [9]ఈ సందర్భములో "ఉదారమైన" అనే పదము, పరిశుద్ధ గ్రంథము అనేది పూర్తిగా మరియు అచ్చుకుఅచ్చులో దేవునిచే ప్రేరేపితమైనది గనుక అసలు తప్పులే లేనిది అని భావించే సంప్రదాయవాద పండితులతో పోల్చితే లేఖమును గూర్చి కొంతమేర దిగువస్థాయి భావమును కలిగియున్న పండితులను సూచిస్తుంది. పరిశుద్ధగ్రంథము సాధారణముగా వాస్తవమినదే కాని అందులో కొన్ని తప్పిదములు ఉన్నాయి మరియు/లేదా దానిలోని ప్రధానమైన ఆలోచన అభినందనీయమైనదే గాని దాని మాటలు దైవికముగా ఇవ్వబడినవి కావు అని ఉదారవాదులు నమ్మవచ్చు. తరచుగా, ఉదారవాద పండితులు ఎక్కువగా

పరిశుద్ధగ్రంథములోని వివిధమైన మాటలు దేవుని నుండి ఉద్భవించినవి కావు గనుక మరి ఎక్కడ నుండి వచ్చినవి అనే విషయమును వివరించడమే తమ ప్రధాన పాత్రగా చూస్తారు. దీనికి తోడు, పరిశుద్ధగ్రంథములోని అద్భుతములను సంప్రదాయవాద పండితులు వాస్తవముగా నమ్ముతుండగా; ఉదారవాదులు మాత్రము, సహజముగా, అలా నమ్మరు. [10]లిఖితపూర్వకమైన పరికల్పనను గూర్చి అధిక సమాచారము కొరకు, చూడండి Coy D. Roper, *Exodus*, Truth for Today Commentary (Searcy, Ark.: Resource Publications, 2008), 651-55.

[11]ఈ సిద్ధాంతమునకు చెందినా "J" దస్తావేజును అలా పిలవడానికి గల కారణము దేవుని గూర్చి వచ్చే ప్రస్తావనలలో ఈ దస్తావేజు "యాహ్వే" (లేదా "యెహోవా") అని ప్రయోగిస్తుండగా, "E" దస్తావేజు మాత్రము ఇదే స్థానములో "ఎలోహీం" అని ప్రయోగిస్తుంది. "D" దస్తావేజు ప్రధానముగా ద్వితీయోపదేశకాండములో ఉంది, మరియు ఆఖరు దస్తావేజు అయిన "P" మాత్రము పంచగ్రంథములన్నిటిలో విస్తరించియుంది సహజముగా యాజకులకు చెందిన విషయములుగా పరిగణింపబడే సమాచారమును కలిగి యుంది. పంచగ్రంథములకు వెనుక ఉన్న మూలముల విషయములో మరియు Wellhausen సిద్ధాంతములో చెప్పిన ఈ నాలుగు దస్తావేజులు మాత్రమేగాక ఇంకా ఏమైనా ఉన్నాయేమో అని పండితులు తమ వాదనలను ఇంకా కొనసాగిస్తూనే ఉన్నారు. [12]ఆఖరుగా వచ్చినదని చెప్పబడినప్పటికీ కూడా, "P" దస్తావేజులో ప్రాచీన కాలమునుండి భద్రపరచబడియున్న కొంత పురాతన సమాచారము కూడా ఉన్నదని చెప్పబడుతుంది. "పరిశుద్ధత స్మృతి"ని 1877లోనే జర్మనీ దేశమునకు చెందిన పండితుడు ఒక సాహిత్య భాగముగా గుర్తించాడు, మాత్రమేగాక ఇది అమడ్చబడియున్న "P" దస్తావేజులో (లేదా దస్తావేజులలో) ఉన్న ప్రత్యేకతల కంటే మరి యెక్కువైన ప్రత్యేకతలనే ఇది కలిగియుంది అని భావించడమైనది. (Richard N. Soulen, *Handbook of Biblical Criticism*, 2nd ed. [Atlanta: John Knox Press, 1981], 90.) పంచగ్రంథములలో ఉన్న మూలముల కొరకు పండితులు ఇంకా పరిశోధన చేస్తూనే ఉన్నారు, ఆఖరుగా P అనే ఈ దస్తావేజు అనేకమైన వేరువేరు మూలముల నుండి సంక్రమించినదిగాను మరియు "P" అనే అక్షరమునకు ఇతర అక్షరములు జతచేయడం కూడా జరిగినది అని కూడా భావించడమైనది. లేవీయకాండము యొక్క ఉద్భవమును గూర్చి ఇతర సిద్ధాంతములు కూడా ప్రతిపాదించబడియున్నవి, కాని మొత్తము కాకపోయినా వాటిలో అధిక శాతము సిద్ధాంతములు లిఖితపూర్వకమైన పరికల్పన సిద్ధాంతమును మాత్రము ఆమోదించినవిగానే ఉండడం గమనార్హం. ఈ విధమైన పరికల్పనకు మరియు లేవీయకాండము ఉద్భవమును గూర్చి ఉన్న వివిధ సిద్ధాంతములపై సమగ్ర విమర్శ కొరకు చూడండి, R. Laird Harris, "Leviticus," in *The Expositor's Bible Commentary*, vol. 2, *Genesis-Numbers*, ed. Frank E. Gaebelein (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1990), 502-13. [13]Gleason L. Archer, Jr., *A Survey of Old Testament Introduction*, rev. and exp. (Chicago: Moody Publishers, 2007), 144. [14]Ibid., 144-46. [15]స్వయాన యేసుక్రీస్తే మోషే ధర్మశాస్త్రమును, లేదా *Torah*ను, వ్రాసాడు అని భావించియుండగా, క్రైస్తవులు వేరుగా ఎలా ఆలోచించగలరు? [16]లేఖనముల మరియు పురావస్తుశాఖ ఆధారములను వేరుగా విశదపరచే కొంతమంది పండితులు నిర్గమము క్రీ.పూ. 1290లో జరిగినదిగా, మరియు కనాను దేశమునకు ప్రవేశము క్రీ.పూ. 1250లో జరిగినదిగా భావిస్తారు. మరింత అధిక సమాచారము కొరకు చూడండి, Roper, *Exodus*, 656-59. [17]ఇశ్రాయేలీయులు ఐగుప్తుదేశమును వీడిన తరువాత మూడవ నెల మొదటి దినమున సీనాయి పర్వతము వద్దకు వచ్చారు (నిర్గమ. 19:1). నలుబది దినములు చొప్పున రెండు పర్యాయములు మోషే ధర్మశాస్త్రమును స్వీకరించు నిమిత్తము ఆ పర్వతముపై గడిపాడు; రెండవ సారి ఆయన తిరిగి వచ్చినప్పుడు, ఇశ్రాయేలీయులు ప్రత్యక్షగుడారమును నిర్మించడం ప్రారంభించారు. వారు ఐగుప్తుదేశమును వీడిన తరువాత రెండవ సంవత్సరము మొదటి నెల మొదటి దినమున ప్రత్యక్షగుడారము యొక్క నిర్మాణమును వారు పూర్తిచేసారు (నిర్గమ. 40:17), అంటే సీనాయి వద్దకు వచ్చిన పది నెలల తరువాత మరియు ప్రత్యక్షగుడారపు నిర్మాణ పనిని మొదలుపెట్టిన ఆరు నెలల తరువాత. రెండవ సంతవ్సరము రెండవ నెల

ఇరువదియవ దినమున కనాను దేశమునకు తమ ప్రయాణము నిమిత్తము సీనాయిని వీడారు (సంఖ్యా. 10:11). కాబట్టి, పది దినములు తక్కువ ఒక పూర్తి సంవత్సరము వారు అక్కడ సీనాయిలో ఉన్నారు. [18]ఈ పుస్తకమును గూర్చిన ఈ వివరణను ఆధారము చేసికొని దీనిలోని విషయములు కేవలము యాజకులకు మాత్రమే వర్తించేవి, లేదా వారికి మాత్రమే తెలిసినవి అని భావించకూడదు. లేవీయకాండములోని న్యాయవిధులకు తాము విధేయులు అగునట్లు ప్రతియొక్క ఇశ్రాయేలీయుడు కూడా వీటిని తెలిసికొనవలసినవాడిగానే ఉన్నాడు. [19]"క్రొత్తనిబంధనలో లేవీయకాండము"ను "అనుబంధము" 175వ పేజీలో చూడండి. [20]Harold Lindsell, "Introduction to Leviticus," in *NRSV Harper Study Bible*, exp. and updated, ed. Verlyn D. Verbrugge (Grand Rapids, Mich.: Zondervan, 1991), 139.

[21]Bill T. Arnold and Bryan E. Beyer, *Encountering the Old Testament* (Grand Rapids, Mich.: Baker Books, 1999), 119. [22]Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *A Hebrew and English Lexicon of the Old Testament* (Oxford: Clarendon Press, 1977), 872. [23]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 113. [24]ధర్మశాస్త్రము యొక్క సమగ్రమైన గుణమును గూర్చి ఈ పుస్తకములో విపులముగా చర్చించబడినది: Roper, *Exodus*, 684-85. [25]Vine, Unger, and White, 307.